# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు అవసరమైన ఆర్థిక భరోసాను కల్పించామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు.
- పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.
- పర్యాటక రంగంలో విశాఖను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని పర్యాటక శాఖ ఎం.డి. ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు.

===========================

విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఆర్థిక భరోసా కల్పించిందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రైవేటీకరణ నుండి విశాఖ స్టీల్ ప్లాంట్ ను మినహాయించి, స్టీల్ ఉత్పత్తి పెంచాలనేదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని అని స్పష్టం చేసారు. నష్టాల్లో ఉన్న సంస్థ విలీనానికి సెయిల్ అభ్యంతరం చెప్పిందని, నష్టాల నుండి బయట పడ్డాక అప్పగించమని చెప్పిందని మంత్రి తెలిపారు. మరో భారీ ప్యాకేజీ కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ కు భవిష్యత్ లో ఇస్తామని కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ప్రకటించారని వెల్లడించారు. ఈ సంవత్సరం ఆగస్టు నెలాఖరుకి స్టీల్ ప్లాంట్ ను లాభాల బాట పట్టిస్తామని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

===========================

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు ఉన్నారని రాష్ట్ర  జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈరోజు ఆయన పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయా ఫ్రమ్ వాల్ పనులను పరిశీలించి, యంత్రాల పని తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రయోగశాలను సందర్శించి ప్యానెల్ తవ్వకాల్లో వస్తున్న వివిధ రకాల రసాయనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఇటీవల వెయ్యి కోట్ల రూపాయలు అందజేశామన్నారు. వచ్చే నెల 1 నుండి 2వ కట్టరు పని ప్రారంభిస్తుందని... మూడో కట్టరు ఏప్రిల్ నాటికి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మూడు కట్టర్ల ద్వారా త్వరితగతిన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

===========================

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలో మంత్రి కందుల దుర్గేష్ పర్యటన చేసి, పలు అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. నిడదవోలు సమీపంలోని ఐరన్ బ్రిడ్జిని మంత్రి పరిశీలించారు. సమిశ్రగూడెం మలుపు వద్ద కనీస రక్షణ లేకుండా గ్రిల్ విరిగి ఐరన్ బ్రిడ్జి ప్రమాదకరంగా మారడంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలిగే ఏ అంశాన్ని సహించబోనని మంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందించేందుకు చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

===========================

ప్రపంచ స్థాయి ప్రమాణాలు పాటిస్తూ... విశాఖపట్టణంలో పర్యాటక పరమైన అవకాశాలను కల్పించాలని రాష్ట్ర టూరిజం శాఖ ఎండీ ఆమ్రపాలి సూచించారు. పర్యాటక ప్రాజెక్టులు, ప్రణాళికల రూపకల్పన, మౌలిక వసతుల ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై ఆమె విశాఖ జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యాటక రంగంలో విశాఖను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలన్నారు. క్రూయిజ్ టూరిజంకు సంబంధించి పోర్టు ఆధ్వర్యంలో ప్రత్యేక టెర్మినల్స్ నిర్మించి, అవసరమైన వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. నగరంలోని ప్రస్తుత బీచ్ లకు అనుబంధంగా అదనపు బీచ్ లను అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కంబాల కొండ, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్లలో బోటింగ్ అవకాశాలపై దృష్టి సారించాలని, జూ పార్కులో అదనపు హంగులు కల్పించాలని ఆమె అధికారులకు సూచించారు.

===========================

వచ్చే నెల 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ప్రతిపాదిత అంశాలను వచ్చే నెల 4వ తేదీ సాయంత్రం లోపుగా కేబినెట్ ఆమోదం కోసం పంపాలని వివిధ ప్రభుత్వ శాఖలకు సీ.ఎస్. కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది.

విరామం

===========================

జిల్లాలో పారిశ్రామిక రంగంలో ఉన్న అవకాశాలపై దృష్టిని సారించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యాటక, ఆతిథ్య రంగాల్ని సేవా రంగాలుగా పరిగణిస్తున్న నేపథ్యంలో పర్యాటక రంగంతో పాటు, ఆతిథ్య రంగాలైన హోటళ్లు తదితరమైన వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

===========================

పల్లె పండుగ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులపై కలెక్టర్ దృశ్య మాధ్యమంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా  ఎంపిడిఓలు, ఎపిఎంలు, పిఆర్ ఏఈలకు పలు ఆదేశాలను జారీ చేశారు. మొదటి విడత గోకులాల నిర్మాణం ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమం కింద జిల్లాలో 2 వేల 42 సిసి రోడ్ల పనులను మంజూరు చేయగా.. వీటిలో ఇప్పటివరకు వెయ్యి 969 రోడ్ల నిర్మాణం ప్రారంభమైందని చెప్పారు.

(వాయిస్ 27 సెకన్లు)

=============================

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో  2025 - 26 విద్యా సంవత్సరానికి గాను వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటన విడుదల చేసిందని ఉపకులపతి టి.వి. కట్టిమణి తెలిపారు. డిగ్రీ పాసైన వారు, చివరి సంవత్సరం పరీక్షలు రాసే వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే పరీక్షల్లో అర్హులైన అభ్యర్థులు మాత్రమే గిరిజన విశ్వ విద్యాలయంలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, ఐ.టి.డి.ఏ. ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

=============================

"సడక్ సురక్ష అభియాన్" ప్రచారంలో భాగంగా అనకాపల్లి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ...  ప్రతి రోజు సగటున 473 మంది, ప్రతి 3 నిమిషాలకి ఒకరు చొప్పున రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని అన్నారు. భద్రత కోసం ప్రతి ఒక్కరు ద్విచక్రవాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే మద్యం సేవించి, మొబైల్ లో మాట్లాడుతూ.. వాహనాలు నడపరాదని చెప్పారు. రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.

=============================

ఆర్థిక ప్రగతికి, ప్రజా సంక్షేమానికి బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 3వ త్రైమాసానికి సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రాధాన్యత రంగాలకు ఎక్కువగా నిధులు కేటాయిస్తూ.. బ్యాంకుల వారీగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ఆర్థిక ప్రగతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాలను సఫలీకృతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని చెప్పారు.

=============================

మహా కుంభ మేళా కోసం తూర్పు కోస్తా రైల్వే నర్సాపూర్- బెనారస్ స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైలు ఈనెల 26, ఫిబ్రవరి 2వ తేదీల్లో నర్సాపూర్ లో బయలుదేరి బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 27, ఫిబ్రవరి 3వ తేదీల్లో బనారస్‌లో బయలుదేరి నర్సాపూర్ చేరుకుంటుంది. ఈరైలు రాష్ట్రంలోని రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం స్టేషన్లలో ఆగనుంది.

=============================

=============================